క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, తుళ్లూరువారి వీధిలోగల ఉర్దూ మున్సిపల్ పాఠశాలలో నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. విజయవాడకు చెందిన విపోదా ఫిన్‌స్పైర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నక్క రాం బాలాజీ తన జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు బుక్స్ అందచేశారు.

రంజింప చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జగ్గయ్యపేటకు చెందిన శ్రీ త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీకి చెందిన శ్రీభారత దేవి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కొలువైతివా రంగసాయి.. అయిగిరి నందిని.. బృందావన నిలయమే వంటి కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారిని దర్శించుకుని రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు కళావేదికపై జరుగుతున్న నృత్య ప్రదర్శనను వీక్షించి మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం కళాబృందంలోని సభ్యులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

రెండు బస్సుల మధ్య ఇరుక్కొని మహిళా ఉద్యోగి దుర్మరణం

పటమట(విజయవాడతూర్పు): ఆటోనగర్ బస్ డిపోలో బస్సు వెనక్కి తిప్పుతుండగా జరిగిన ప్రమాదంలో బస్సు వెనుక ఉన్న మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగి బుధవారం దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .... కృష్ణలంకకు చెందిన మరియమ్మ ఆటోనగర్ ఆర్టీసీ బస్ డిపోలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తుంది. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మరియమ్మ బస్సును శుభ్రం చేస్తుండగా అదే సమయంలో మరో బస్సు డ్రైవర్ రివర్స్ చేసే సమయంలో మరియమ్మను గమనించకపోవటంతో ఆమె రెండు బస్సుల మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో మరియమ్మకు బలమైన గాయం తగలగా డిపో సిబ్బంది ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం తాడేపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న మరియమ్మ బుధవారం మరణించింది. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 20న నిర్వహించిన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీల్లో సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఫార్మడి విద్యార్థి టీడీవీఎం సతీష్ సత్తా చాటారు. కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సతీష్ సీనియర్ విభాగం 93 కేజీల పవర్ లిఫ్టింగ్‌లో మొదటిస్థానం పొందారు. దీంతో సతీష్‌ను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత, ఫిజికల్ డైరెక్టర్ వినయ్ శేకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

గన్నవరం/ఉంగుటూరు: దొంగతనం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ గన్నవరం 8వ అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధవి, ఉంగుటూరు ఎస్‌ఐ గోవిందు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దావాజిగూడెం శివాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న చావలి మురళీకృష్ణ ఇంటిలో ఈ ఏడాది జూలై 22న చోరీ జరిగింది. 35 గ్రాముల బంగారం, సుమారు కిలో వెండి వస్తువులతో పాటు రూ. 30 వేలు నగదు అపహరించుకుపోయారు. ఈ కేసులో నిందితుడైన గుడివాడలోని కొత్తపేటకు చెందిన ముద్దాని జగదీష్‌ను గన్నవరం అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో మరో చోరీ కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ఒక్కో కేసులో రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఇసుక దందాతో అవస్థలు

- పనులు లేక ఆందోళన బాట పడుతున్న భవన నిర్మాణ కార్మికులు
- ఇసుకను అడ్డగోలు ధరలకు అమ్ముతున్న ప్రభుత్వం
- ఇసుక కొనుగోలు చేయలేక నిర్మాణాలను వాయిదా వేసుకుంటున్న వైనం
- లక్ష మంది కార్మికులకు దూరమవుతున్న పనులు



పనుల కోసం ఎదురు చూస్తున్న కార్మికులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానంతో ప్రజలు అల్లాడుతున్నారు. పాలకుల విధానాలకు తోడు అధికార పార్టీకి చెందిన నేతల దందాలతో ఇసుక ధర సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. పెరిగిన ఇసుక ధరల కారణంగా అటు భవన నిర్మాణ కార్మికులతో పాటుగా ఇల్లు కట్టుకోవాలని భావిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇసుకను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వ పెద్దలు పాలకపక్ష నేతలకు అండగా ఉండటంతో ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని కార్మికులు విమర్శిస్తున్నారు. ప్రధానంగా అధికార పక్ష నేతల దందాల వలన అందుబాటులో లేని ఇసుక వలన పనులు కరువై కార్మికులు ఆందోళన బాట పడుతున్నారు. పెరిగిన ఇసుక ధరలతో నగర వ్యాప్తంగా ఉన్న వేలాదిమంది కార్మికులు పస్తులుంటున్నామని వాపోతున్నారు.

లారీ ఇసుక రూ.30 వేలకు పైమాటే

ఇసుక ఉచితంగా పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ఆర్భాటంగా ప్రకటించి హడావుడి చేసిన విషయం అందరికీ తెలిసిందే. కానీ ఆచరణలో అది ఎక్కడా అమలవుతున్న తీరు కనపడటం లేదు. నగరంలో ఇసుక లారీ ధర సుమారుగా రూ.30 వేలకు పైమాటేనని భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు చెబుతున్నారు. అలాగే ట్రాక్టర్ ధర ఎనిమిది వేల నుంచి పది వేల వరకూ పలుకుతుంది. లారీకి సుమారుగా 18 నుంచి 20 టన్నుల వరకూ ఇసుక వస్తుంది. అదేవిధంగా ట్రాక్టర్‌లో సుమారు నాలుగు టన్నుల వరకూ ఇసుక వస్తుందని కార్మికులు చెబుతున్నారు. ఇసుక ఎంత ధర పెట్టినా అవసరమైన సమయంలో ఇసుక వస్తుందనే నమ్మకం లేకుండా పోయింది. దీనివలన నగరంలోని కార్మికులు పనులు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. దానికి తోడు ఇసుక దందా నడుపుతున్న వ్యాపారులను ఎవరూ అదుపు చేయలేకపోవటంతో రోజుకొక ధర పలుకుతుందని భవన నిర్మాణ కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దుర్మార్గమని నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పనులకు దూరమవుతున్న కార్మికులు....

విజయవాడతో పాటుగా జిల్లా చుట్టు పక్కల నుంచి నిత్యం వేలాది మంది కార్మికులు భవన నిర్మాణంలో పనుల కోసం నగరానికి తరలి వస్తుంటారు. భవన నిర్మాణంలో ఇసుక చాలా ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. ఇసుక లేకపోతే నిర్మాణంలోని ఇతర పనులకు కూడా ఆటంకం కలిగే అవకాశముంది. ఇసుక లేకపోవటంతో నిర్మాణ పనులు మందకొడిగా సాగటం దాని ప్రభావం నిర్మాణం రంగంలోని ఎలక్ట్రికల్, ప్లంబర్ వంటి అనేక మిగిలిన విభాగాలపై పడటంతో వారికి పనులు అరకొరగానే లభిస్తున్నాయి. నగరంలో సరసమైన ధరకు, సకాలంలో ఇసుక లభించకపోవటం వలన సుమారు లక్ష మంది కార్మికులు ప్రభావితమవుతున్నారని నాయకులు చెబుతున్నారు. వీరందరికీ పనులు లభించక అల్లాడుతున్నారని వారు వివరిస్తున్నారు.



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పనులు ఆగిపోతాయి



పనుల కోసం రోజుల తరబడి ఎదురు చూసే పరిస్థితులు దాపురించాయి. గతంలో మా కోసం ఎదురు చూసే పరిస్థితులు ఉండేవి. ఇసుక లేకపోతే భవన నిర్మాణంలోని అన్ని పనులు ఆగిపోతాయి. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఇసుక ధరలను తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– సూర శ్రీనివాసు, భవన నిర్మాణ కార్మికుడు

పస్తులుండాల్సి వస్తుంది



ఇసుక సకాలంలో లభించకపోవటంతో పనులు ఉండటం లేదు. దాంతో పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇసుక లభించకపోవటం వలన పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించాలి. ఇసుక ధరలను తగ్గించేందుకు చర్యలు చేపట్టి కార్మికులకు సహకరించాలి.

– గొలుసుల రాజా, భవన నిర్మాణ కార్మికుడు

ఇసుక ధరలును అదుపు చేయాలి



ఇసుక ధరలను అదుపు చేయాలి. ఇసుక ధరలు రోజుకొక రేటు ఉంటున్నాయి. దీనిపై ఎవరూ మాట్లాడటం లేదు. గతంలో రోజు ఎక్కడో ఒక చోట పనులు దొరికేవి. ప్రస్తుత ప్రభుత్వ ఇసుక విధానంతో మాలాంటి కార్మికులకు పనులు కరువయ్యాయి. పనులు లేకుండా కుటుంబం నడిచేది ఎలా ?

– శివరాత్రి లింగయ్య, భవన నిర్మాణ కార్మికుడు

ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలి



ప్రభుత్వం ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తామని చెప్పింది. కానీ అది ఎక్కడా ఆచరణలో కనిపించటం లేదు. తక్షణం ఇసుకను ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఇసుక ధరలు ఆకాశాన్నింటుతుండటంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కొంత మంది ధరలు తగ్గుతాయని, మరికొంతమంది ఈ ధరలతో మేం నిర్మాణం చేయలేమని మానుకుంటున్నారు. దానివలన కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుంది. ప్రభుత్వం తక్షణం ఇసుక విధానంపై చర్యలు చేపట్టాలి.

– కొత్తపల్లి శంకరయ్య, నగర కార్యదర్శి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్

పాతశివాలయం హుండీ ఆదాయం రూ.4.40 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) హుండీ ఆదాయం రూ.4,40,851 లభించింది. ఆలయంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను బుధవారం లెక్కించారు. దేవదాయ ధర్మదాయ శాఖ నుంచి పర్యవేక్షణాధికారిగా సృజన్ హాజరై లెక్కింపును పర్యవేక్షించారు. ఆలయంలోని సుమారు 29 హుండీలను లెక్కించగా ఈ ఆదాయం లభించిందని, సుమారు 209 రోజులకు సంబంధించిన ఆదాయంగా ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజ్ షణ్ముగం తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ బొమ్మ మధు ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

25న మెగా రక్తదాన శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) ఆధ్వర్యంలో ఈ నెల 25న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా విజయవాడలోని ఎంజే నాయుడు ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తెలిపారు. రక్తదానం ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం అందిస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన రక్తదాతలు అందరూ పాల్గొనవచ్చన్నారు.

వరద బాధితులకు బియ్యం బస్తాల పంపిణీ



ట్రస్ట్ అందించిన బియ్యం బస్తాలతో వరద బాధితులు, సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఇటీవల సంభవించిన బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, మధురానగర్‌లోని బాధితులకు బడావో బంజారా ప్రొజర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం బియ్యం బస్తాల పంపిణీ కార్యక్రమం జరిగింది. రెండు ప్రాంతాల్లో మొత్తం 150 కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం బస్తాను అందచేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ భూక్యా లాజరస్ లాల్ సింగ్ మాట్లాడుతూ వరద కారణంగా ఇళ్లు మునిగిపోయి వాటిల్లో ఉన్న లక్షలాది రూపాయల వస్తువులను పోగొట్టుకున్న బాధితులు ఇప్పట్లో కోలుకోలేని పరిస్థితి లేకపోవడం బాధాకరమని తెలిపారు. రోజువారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూనే రూపాయి రూపాయి దాచుకుని కొనుక్కున్న గృహోపకరణాలు, చివరికి పడుకునే మంచాలు కూడా పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్తు సమయాల్లో బాధితులకు చేయూత ఇవ్వటం తమ సామాజిక బాధ్యతగా భావించి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి తమ వంతు సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ ప్రేమ్‌సాగర్ సింగ్ భూక్యా, కార్యనిర్వాహకుల సాలోమోను భూక్యా, నతానియేల్ నాయక్, మల్హార్ నాయక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో టీడీపీ పరిస్థితి బాగోలేదు

ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)



భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్, కార్యకర్తల పరిస్థితి బాగోలేదని, దాని నుంచి బయటపడేసేందుకు ప్రయత్నిస్తానని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పాలఫ్యాక్టరీ వద్దగల ఫంక్షన్ హాల్లో బుధవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్డీఏ కూటమి బలపరిచిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ లోపు గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ఎస్ బేగ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్లు అందరూ ఆలపాటి గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి

కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశపు హాల్లో బుధవారం ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాల పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం వరద ప్రభావితం కాని ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, ఆస్తి, ఇతర పన్నుల అంశాల పురోగతిపై అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. నూతనంగా నిర్మించిన భవనాలు, అదనంగా వేసిన ఫ్లోర్లు, ఏమేమి ఉన్నాయో రెవెన్యూ అధికారులు పర్యటించి ఎప్పటికప్పుడు పన్నులు వేయాలని సూచించారు. ఆస్తిపన్ను అనంతరం నీటి పన్ను కూడా ఉందా లేదా అనేది పరిశీలించాలని పేర్కొన్నారు. పన్నుల వ్యవహారంలో రెవెన్యూ–ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం , అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో యువీ రామరాజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్షల్లో ఎన్టీఆర్ జిల్లా మెరుగైన ఫలితాలను సాధించే దిశగా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యువీ రామరాజు కోరారు. జిల్లాలో పదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా పునశ్చరణ తరగతులు బుధవారం నగరంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లాను మొదటి స్థానంలో ఉంచే దిశగా ఉపాధ్యాయులు పాటు పడాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకూ రోజుకొక సబ్జెక్టుపై టీచర్లకు పునశ్చరణ తరగతులు జరుగుతాయన్నారు. జిల్లాలోని అందరూ సబ్జెక్ట్ ఉపాధ్యాయులు వీటికి తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. తరగతులను వినియోగించుకొని పాఠశాలల్లో విద్యార్థులు ఆ విజ్ఞానాన్ని అందించాలని సూచించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల మండలి ద్వారా ఈ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఉమర్‌అలీ, నార్త్ ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్–3 పరిధిలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రిజర్వాయర్–1లో ఇంటర్ కనెక్షన్ పనిచేయటం లేదని, దీన్ని మరమ్మతులు చేసే నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరిగే 7, 8, 9 డివిజన్లలోని బాడవపేట, నెహ్రూనగర్, మొగల్రాజపురం, నవోదయ కాలనీ, జర్నలిస్టు కాలనీ, పీబీపీ రోడ్డు, డింపుల్‌బార్ రోడ్డు, వరమహాలక్ష్మీ రోడ్డు, మల్లెల పరమేశ్వరరావు రోడ్డు, ఉడ్‌పేట, శాంతినగర్, మధు గార్డెన్స్ రోడ్డు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు నిలిపేస్తున్నామని తెలిపారు. ఇంకా రెల్లీస్ బజారు, లబ్బీపేట, పైడయ్యవీధి, వెంకటేశ్వరస్వామి ఆలయం రోడ్డు, తుర్లపాటి కుటుంబరావు వీధి, గౌరయ్యనగర్, నేతాజీ బ్రిడ్జి రోడ్డు, కృష్ణానగర్ రోడ్డు, లక్ష్మీనగర్, గౌస్ వీధి, మస్జిద్ వీధి, గ్రీన్‌ల్యాండ్స్ రోడ్డు, చంద్రమౌళిపురంలో నీటి సరఫరా ఉండదని తెలిపారు. శ్రీ రామనగర్, ఫకీర్‌గూడెం, ఆదార్శ్ రోడ్డు, వైవీరావు ఆస్పత్రి రోడుడ, కళానగర్, సాయి నగర్, పిట్టింగుల పేట, గాయత్రీ నగర్; కంచుకోట బజారు, పాత 5వ నంబరు బస్సురూటు, అశోక్‌నగర్, రామచంద్ర నగర్, బ్యాంక్ కాలనీ 1,2, రెవెన్యూ కాలనీ, టిక్కిల్ రోడ్డు, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, శ్యామ్‌నగర్, సిద్దార్థ నగర్, బృందావన కాలనీ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది పేర్కొన్నారు.

పెనమలూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పెమలూరులో ఓ వ్యక్తిపై దాడి ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు వంతెన డౌన్‌లో అన్నవరపు వీరరాజేష్ బార్బర్ షాపు నిర్వహిస్తాడు. మంగళవారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన కొలువుకంటి సుధీర్ బార్బర్ షాపునకు కటింగ్ చేయించుకోవటానికి వచ్చాడు. షాపులో సుధీర్ రాజకీయాలు మాట్లాడుతుండగా వీరరాజేష్ వద్దని వారించాడు. దీంతో సుధీర్ ఆగ్రహించి దుర్భాషలాడి వెళ్లాడు. మళ్లీ సాయంత్రం సుధీర్ కొంత మంది వ్యక్తులతో వచ్చి రాజేష్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



బహుమతులను అందిస్తున్న డాక్టర్ కృష్ణవేణి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కంప్యూటర్ రంగ విద్యార్థులు నూతన అంశాలపై నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో మొంగో డీబీ జెన్ ఏఐపై ఒక రోజు హ్యాకథాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యార్థులు వర్క్‌షాప్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిపుణుల సూచనలతో విద్యార్థులు ఆయా అంశాలపై పట్టు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగంల్లో నూతనంగా వస్తున్న ఆవిష్కరణలు, మార్పులు తెలియజేసేందుకు ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని వెల్లడించారు. వాటిని అర్థం చేసుకొని పట్టు సాధించాలని సూచించారు. అప్పుడే విజయాలను సాధిస్తారని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు పి.రవీంద్ర, పవన్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ఉద్యమాలే శరణ్యం

మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, ఇకపై ఉద్యమాలే శరణ్యమని మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై హత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులు రోజు రోజుకీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఘాతుకం మరువకముందే మరో చోట మరో దుర్ఘటన జరుగుతుండటం స్త్రీలను భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోనే రాష్ట్రంలో ఇద్దరిపై గ్యాంగ్ రేప్, మరో ఇద్దరిపై ఘోర దాడులు జరగటం లా అండ్ ఆర్డర్ ఉందా అన్న అనుమానం కలుగుతుందని తెలిపారు. ఆడపిల్లపై చేయి వేసిన వారికి అదే చివరి రోజు అవుతుందని సీఎం, హోం మంత్రి గడిచిన నాలుగు నెలల్లో పలుమార్లు ప్రకటించినా ఘోరాలు ఆగలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలు, చిన్న పిల్లలపై 74 నేరాలు జరిగాయన్నది సుస్పష్టమని తెలిపారు. మద్యంపై వచ్చే ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడిపించే దిశగా కూటమి ప్రభుత్వం మద్యం షాపులను గత ప్రభుత్వం కంటే ఎక్కువగా పెంచారని అన్నారు. వీటి వలన జరిగే అనర్థాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, దానిని తెలియ చేప్పేందుకు ఉద్యమాలు శరణ్యం అంటున్నామని తెలిపారు.

పెరికీడు గ్రామ సచివాలయంలో చోరీ



పెరికీడు సచివాలయంలో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ సురేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని గ్రామ సచివాలయంలో బుధవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామ సచివాలయం తలుపులు బద్దలుకొట్టి లోపల ఉన్న కంప్యూటర్ ప్రింటర్, సౌండ్ స్పీకర్, ఇతర ఆఫీసు సామగ్రిని దొంగిలించారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తలుపులు తెరిచి ఉండటం చూసి ఆందోళన చెందారు. కార్యాలయంలో చోరీ జరిగినట్లుగా గుర్తించిన సచివాలయం సిబ్బంది హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వి.సురేష్ సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించారు. ఈ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు నమోదు కేంద్రం ప్రారంభం



కృష్ణలంక(విజయవాడతూర్పు): 2021 నాటికి గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.వెంకటేశ్వర్లు, ఎన్.సి.హెచ్.శ్రీనివాస్ అన్నారు. రాణిగారితోటలోని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు నమోదు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అప్లికేషన్ కావాల్సిన వారు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవాలనుకునే వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. శాసనమండలిలో కార్మికుల హక్కులు, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, వారు బలబరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా ఆశావర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కమల, ఎం.శ్రీనివాస్, ఎం.సోమేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.